# సమీకృత దుకాణాల వేలం జరిగేనా?

- గత నెల 30న వేలానికి నోటిఫికేషన్
- 5న ముగిసిన గడువు ● రాని ఒక్క దరఖాస్తు

గద్వాలటౌన్, జూన్ 8: సమీకృత మార్కెట్ వస్తే ఎంతో సౌలభ్యం.. కూరగాయలు.. మాంసాహారం.. పండ్లు ఇలా అన్ని ఒకేచోట లభించాలన్న సంకల్పంతో బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో సమీకృత మార్కెట్ సముదాయాన్ని నిర్మించారు. ప్రారంభించిన ఏడాదిన్నరకు వేలం ప్రకటన చేశారు. ప్రకటన గడువు ముగిసిన ఏ ఒక్కరూ ముందుకు రాలేదు.. ప్రకటన ప్రకారం సోమవారం దుకాణాల వేలం వేయాలి.. మరి వేలం వేస్తారా.. వాయిదా వేస్తారా అన్నది ఇప్పటివరకు అధికారులు చెప్పకపోవడం అధికారుల పనితీరుకు నిదర్శనంగా నిలుస్తుంది.

జిల్లా కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ యార్డులో బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో 2021లో సమీకృత మార్కెట్ సముదాయ భవనానికి శంకుస్థాపన చేశారు. ఎస్‌డీఎఫ్ నిధులు రూ. 12 కోట్లతో మార్కెట్ సముదాయాన్ని నిర్మించారు. 2023లో మార్కెట్ సముదాయాన్ని ప్రారంభం చేశారు. ప్రారంభం చేసి ఏడాదిన్నర దాటిన తరువాత గత నెల 30న 38 దుకాణాల వేలానికి మున్సిపల్ కమిషనర్ ప్రకటన జారీ చేశారు. జూన్ 9న దుకాణాల వేలం ఉంటుందని, 5వ తేదీ వరకు ఆసక్తి గల వారు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ప్రకటన ప్రకారం 5తేదీ వరకు ఏ ఒక్కరూ కూడా వేలానికి దరఖాస్తు చేసుకోలేదు. అధికారుల ప్రకటన ప్రకారం సోమవారం వేలం నిర్వహించాల్సి ఉన్నది. అధికారులు మాత్రం ఇంతవరకు వేలం నిర్వహణపై ఎలాంటి ప్రకటన చేయలేదు.


దుకాణాల ముందు మొలచిన కంపచెట్లు

***అసంపూర్తిగా నిర్మాణాలు..***

2021 మార్కెట్ సముదాయ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. దాదాపు నాలుగేండ్లు కావస్తుంది. అయిన ఇంకా అసంపూర్తిగానే నిర్మాణాలు ఉన్నాయి. సరైన వసతులు లేవు. మార్కెట్ సముదాయం అంతా కూడా ముళ్ల చెట్లతో నిండి పోయింది. విద్యుత్ సౌకర్యం, నీటి వసతులు అంతంతమాత్రంగానే ఉన్నాయి. సరైన వసతి కల్పించడంలో అధికారులు విఫలమ య్యారన్న ఆరోపణలు ఉన్నాయి.

***ముందుకు రాని వ్యాపారస్తులు..***

మున్సిపల్ దుకాణాలు అంటే పోటీపడుతూ.. నిర్ణీత ధర కంటే మూడింతలు పాడి దక్కించుకునే వ్యాపారస్తులు దరఖాస్తు చేసుకునేందుకు ముందుకు రాకపోవడంపై అధికారులు విస్మయాన్ని వ్యక్తం చేస్తున్నారు. దుకాణాలను దక్కించుకునేందుకు కొందరు వ్యాపారస్తులు వేసిన ఎత్తుగడగా కొందరు అధికారులు చెబుతున్నారు. ఎవరూ ముందుకు రాని పక్షంలో పోటీ ఉండక ప్రభుత్వ నిర్ణీత ధరకే దుకాణాలను దక్కించుకోవచ్చని ఆలోచనలో వ్యాపారస్తులు ఉన్నారన్న అభిప్రా యాన్ని అధికారులు వ్యక్తం చేస్తున్నారు.

## విలుగాండ్ర వీరస్మారక శిలలు గుర్తింపు


గాండ్ర వీరస్మారక శిలలను ప్రదర్శిస్తున్న దృశ్యం

వనపర్తి టౌన్, జూన్ 8 : వనపర్తి జిల్లా కేంద్రంలోని పోచమ్మ గుడి వద్ద 15,16 శతాబ్దాల వీరగల్లులు, విలుగాండ్రైన వీరుల స్మారక శిలలను, సతీ శిలలు కొత్త తెలంగాణ చరిత్ర బృందం పరిశోధకులు, చరిత్రకారులు బైరోజు చంద్రశేఖర్, డాక్టర్ బైరోజు శ్యాంసుందర్‌లు గుర్తించారు. ఆదివారం వీరస్మారక శిలలను ప్రదర్శించి వాటి గురించి వివరించారు. ఈ వీరశిలలలో తొమ్మిది మంది విలుగాండ్రు, ఒక అశ్వరూపుడైన వీరుడు బల్లెంతో, మరొక వీరుడు బల్లెం, డాలుతో అగుపిస్తున్నారని, ఈ వీర శిలలలో స్త్రీలు పక్కన కనిపిస్తున్న సతీశిలలు నాలుగు ఉన్నట్లు వారు చెప్పారు. విలుగాండ్రలలో కత్తి కూడా ఆయుధంగా ధరించిన ఎక్కటీలు ఇద్దరున్నారని, ఇద్దరు వీరు స్మారక శిలలు ఒకేచోట లభించడం వల్ల వనపర్తి ఒకనాటి యుద్ధరంగమై ఉంటుందని అనవచ్చని, వీరారాధన క్రీస్తుకు పూర్వం నుంచి ఉన్నదని, వీరగల్లులలో దాదాపు నలభై రకాలున్నాయని, శాసనంతో వీరగల్లులు వాటిలో ప్రత్యేకమని వీరుల చరిత్ర రాజవంశాల చరిత్రకు సమాంతర చరిత్ర అని కొత్త తెలంగాణ చరిత్ర బృంద కన్వీనర్ శ్రీరామోజు హరగోపాల్ తెలియజేశారు. ఇక్కడికి సమీపంలోని వీర్లగడ్డగా పిలువబడే నాచహళ్లి గోపాల్ వ్యవసాయ పొలంలో కూడా శాసనంతో కూడిన గుడిలాంటి స్థలంలో ఒక సతీశిల , ఒక విలగాని శిలలు వారు గుర్తించనట్లు చెప్పారు.

## అందం .. ఆహ్లాదం

అయిజ, జూన్ 8: పచ్చని చెట్లు.. ఆహ్లాదాన్ని పంచుతున్నాయి. తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు హయాంలో రహదారులు, ప్రభుత్వ కార్యాలయాలు, చెరువులు, కుంటలు, రిజర్వాయర్ల కట్టలపై హరితహారంలో భాగంగా పచ్చని చెట్లను ప్రతిష్టాత్మకంగా పెంచింది. నాడు పెంచిన చెట్లు నేడు పచ్చదనం పర్చుకోవడంతోపాటు రహదారులు ఆహ్లాదాన్ని పంచుతున్నాయి. రాజోళి మండలం, పెద్ద ధన్వాడ, చిన్న ధన్వాడ గ్రామాల మధ్య విరపూసిన గుల్‌మోర్ చెట్లు వాహనదారులు, ప్రజలను కట్టి పడేస్తున్నాయి.


పచ్చదనంతో పరవశిస్తున్న చెట్లు

## పూర్వవిద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

పాన్‌గల్, జూన్ 8: మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాలలో 1995-96 విద్యాసంవత్సరంలో పదోతరగతి చదివిన పూర్వ విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనాన్ని ఘనంగా నిర్వ హించుకున్నారు. ఈ సందర్భంగా ఒకరినొకరు యోగక్షేమాలు తెలుసుకొని పాఠశాలలో పాత జ్ఞాపకాలను గుర్తుకు తెచ్చుకున్నారు. అనంతరం వారికి విద్య బోధించిన గురువులను శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.


1995-96 విద్యాసంవత్సరం పదోతరగతి బ్యాచ్‌కు చెందిన పూర్వవిద్యార్థులు

## మనస్తాపంతో వ్యక్తి ఆత్మహత్య

అయిజ, జూన్ 8: పొలానికి దారి లేదని ఇరుపక్కల రైతులు తేల్చిచెప్పడంతో తీవ్ర మనస్తాపంతో ఓ వ్యక్తి ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన చోటు చేసుకున్నది. ఎస్సై శ్రీనివాసాచారి కథనం మేరకు.. అయిజ పట్టణానికి చెందిన దేవ మహేశ్ (52) చుట్టు పక్కల రైతులు తన పొలానికి దారిలేదని కొంతకాలంగా చెబుతున్నారు. పలు మార్లు చుట్టు పక్కల రైతులు బాట ఇవ్వమని చెప్పడంతో మస్తాపానికి గురై ఆదివారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డారు. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు కిందకు దింపారు. పొలం పక్కన రైతులు బాట ఇవ్వకపోవడంతోనే ఆత్మహత్యకు పాల్పడ్డారని ఆరోపిస్తూ వారి ఇండ్ల ముందు మహేశ్ మృతదేహన్ని ఉంచి నిరసన తెలిపారు. కుటుంబసభ్యుల ఆందోళన గురించి తెలుసుకున్న ఎస్సై వారికి నచ్చచెప్పి మృతదేహాన్ని పోస్టుమార్ట్ నిమిత్తం గద్వాల దవాఖానకు తరలించినట్లు తెలిపారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

## మరమ్మతుకు నోచుకొని నీటి తొట్టి


మరమ్మతుకు నోచుకొని నీటి తొట్టి

మల్దకల్, జూన్ 8: మండలంలోని అమరవాయితోపాటు వివిధ గ్రామాల్లో గతంలో వాటర్ షేడ్ పథకం ద్వారా నిధులను కేటాయించి నీటి తోట్లను నిర్మించారు. పంచాయతీ ద్వారా నీటిని తోట్లకు సరఫరా చేసేవారు. దీని వల్ల గ్రామంలోని పశువులతోపాటు ఇతర మూగ జీవాలకు ఈ నీరు ఎంతో ఉప యోగకరంగా ఉండేదని గ్రామస్తులు వాపోయారు. నీటి తోట్లను మరమ్మతులు చేయాలని అధికారులను కోరిన వాటిని పట్టించుకోవడం లేదని ప్రజలు వాపోతున్నారు. వేసవి కాలం గడిచిపోయిన పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో గ్రామంలో పశువులకు తాగునీటి సమస్యలతో రైతులు చాలా ఇబ్బందులు పడ్డారన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి మరమ్మతులు చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

**WANTED**
★ మహబూబ్‌నగర్‌లోని ప్రైవేట్ హాస్పిటల్‌లో పనిచేయడానికి రిసెప్షనిస్ట్, హౌస్ కీపింగ్, వార్డు బాయ్స్, ఫార్మసిస్ట్, ల్యాబ్ టెక్నిషియన్, నర్సింగ్ స్టాఫ్ కావలెను. Cell: 9133211108
NT-MBNR

**ప్రకటన**
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

To Book your Classified
4 lines Advt
Rs. 200/-
Only (B/W)
Additional Line
50/- Only
For Advertisement Enquiry
Please Contact...
9182777641
9182777654
9182777748

## రేపు ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ పర్యటన

గద్వాల, జూన్ 8: జిల్లాలో ఈ నెల 10న రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బుక్కివెంకటయ్య తన కమిటీ సభ్యులతో కలిసి జిల్లాలో పర్యటించనున్నట్లు కలెక్టర్ సంతోష్ ఆదివారం ప్రకటనలో తెలిపారు. పర్యటనలో భాగంగా కలెక్టర్ కార్యాల యంలోని సమావేశ మందిరంలో ఉదయం 11 గంటలకు బాధితుల సమస్యల పరిష్కారంతోపాటు భూ సమస్యలు, ప్రభుత్వ అభివృద్ధి సంక్షేమ పథకాల అమలు తీరుపై చర్చిం చేందుకు సమావేశం నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. ఈ సమావేశానికి షెడ్యూల్డ్ కులాలు, తెగల నాయకులు తప్పనిసరిగా హాజరై తమ సమస్యలపై కమిషన్‌కు వినతి పత్రాలు అందజేయాలని కోరారు.

## ఐఐటీ సీటు సాధించిన విద్యార్థికి సన్మానం


సన్మానిస్తున్న కేవీపీఎస్ నాయకులు

అమరచింత, జూన్ 8: ఈ నెల 2న ప్రభుత్వం విడుదల చేసిన జేఈఈ మెయిన్ అడ్వాన్స్ ఫలితాల్లో జాతీయస్థాయిలో 412వ ర్యాంక్ సాధించి ఎస్సీ క్యాటగిరిలో ఐఐటీలో సీటుకు అర్హత సాధించిన పట్టాణానికి చెందిన సంపత్‌కుమార్‌ను ఆదివారం కేవీ పీఎస్ నాయకులు పూలమాల శాలువాతో సన్మానం చేశారు. కార్యక్రమంలో కాలనీవాసులు రాజు, భక్తరాజు, అరుణ్‌కుమార్ ఉన్నారు.

## తాళం వేసిన ఇంట్లో చోరీ

- 6 తులాల బంగారం, 30తులాల వెండి అపహరణ

జడ్చర్ల టౌన్, జూన్ 8 : జడ్చర్ల పోలీస్‌స్టేషన్ పక్కనే తాళం వేసిన ఇంట్లో చోరీ జరి గిన ఘటన చోటుచేసుకున్నది. స్థానికుల కథనం ప్రకారం.. జడ్చర్ల పోలీస్‌స్టేషన్ పక్కన షబ్బీర్ అనే వ్యక్తి అద్దె ఇంట్లో నివసిస్తున్నాడు. బక్రీద్ పండుగ నేపథ్యంలో శనివారం ఉదయం ఇంటికి తాళం వేసి కుటుంబసభ్యులతో కలిసి పాపగల్ గ్రామానికి వెళ్లాడు. తిరిగి ఆదివారం ఉదయం ఇంటికొచ్చి చూడగా, తాళం విరగ్గొట్టి ఇంట్లోని తలుపులు, బీరువా తెరచుకొని ఉన్నాయి. బీరువాలో దాచుకున్న 6తులాల బంగారు, 30తులాల వెండి అభరణాలతోపాటు రూ.40వేల నగదు దొంగలు ఎత్తుకెళ్లినట్లు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని దర్యాప్తు చేపట్టారు.

## స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలి

గట్టు, జూన్ 8: రాయాపురం స్టేజీ నుంచి గట్టు వరకు ఆర్అండ్‌బీ శాఖ తారు రోడ్డు రెన్యూవల్ పనులను ఇటీవల చేపట్టింది. అయితే మలుపుల వద్ద ఎలాంటి స్పీడ్ బ్రేకర్ల నిర్మాణం చేపట్టలేదు. దీంతో ఎప్పుడు ఏ ప్రమాదాలు జరుగుతుందోనని ప్రయాణికులతోపాటు వాహనదారులు ఆందోళన చెందుతున్నారు. అదేవిధంగా ఓ గురుకుల పాఠశాల దాటిన తరువాత ప్రమాదభరితమైన మలుపు ఉన్న ది. ఆర్ అండ్‌బీ శాఖాధికారులు స్పందించి స్పీడు బ్రేకర్లు వేయించాలని స్థానికులు కోరుతున్నారు.


ప్రమాదభరితంగా ఓ మలుపు దృశ్యం

## ధాన్యం కొనుగోళ్ల అక్రమాలపై చర్యలేవి ..?

- బీఆర్ఎస్‌వీ జిల్లా కో-ఆర్డినేటర్ కుర్వ పల్లయ్య

అయిజ, జూన్ 8: ఏపీ రాష్ట్రం నుంచి తెలంగాణలోని జోగు ళాంబ గద్వాల జిల్లా, బైనపల్లి ధాన్యం కొనుగోలు కేంద్రానికి ధాన్యం తెచ్చి విక్రయించిన రైతులు, ఐకేపీ నిర్వాహకులు, అధికారులపై ఎందుకు చర్యలు తీసుకోవడంలేదని బీఆర్ఎస్‌వీ జిల్లా కో-ఆర్డినేటర్ కుర్వ పల్లయ్య ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ఆదివారం పట్టణంలోని బీఆర్ఎస్ కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. పట్టపగలే ధాన్యం కొనుగోలు కేంద్రంలో పక్క రాష్ట్రం నుంచి తరలించిన ధాన్యం పట్టుబడిన అధికారులు, నిర్వాహకులపై చర్యలు తీసుకోకపోవడం విడ్డూరంగా ఉందని విమర్శించారు. నాలుగు రోజుల కిందట ట్రాక్టర్ లోడ్‌తో పట్టుబడిన ధాన్యంపై అధికారులు ఎలాంటి చర్యలు చేపట్టలేదన్నారు. ఏఈవో ప్రమేయం లేనిదే సెంటర్ నిర్వాహకులు ధాన్యం రైతులు ఎలా విక్రయిస్తారని పేర్కొన్నారు. ఇప్పటికైనా కలెక్టర్, అదనపు కలెక్టర్లు ధాన్యం కొనుగోళ్లలో అక్రమాలకు పాల్పడుతున్న నిర్వాహకులతోపాటు సహకరిస్తున్న అధికారులపై చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. సోమవారం బైనపల్లి ఐకేపీ కేంద్రంలో కొనసాగుతున్న అక్రమాలపై పూర్తి ఆధారాలతో కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తున్నట్లు ఆయన వెల్లడించారు. బీఆర్ఎస్‌వీ పట్టణ మాజీ అధ్య క్షుడు కుర్వ వీరేశ్, రామాంజనేయులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న జిల్లా కో-ఆర్డినేటర్ కుర్వ పల్లయ్య

## బీసీలకు 42 శాతం రిజర్వేషన్ పెంచాలి

కొత్త కోట, జూన్ 8: బీసీలకు 42శాతం రిజర్వేషన్ ఇచ్చిన తర్వాతే గ్రామ పంచాయతీ ఎన్నికలు నిర్వ హిచాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ భీమన్న నాయుడు మాతృమూర్తి మృతి చెందిన విషయం తెలుసుకొని మండలంలోని కానాయపల్లిలో ఆయన నివాసానికి వెళ్లి ఆయనను పరామర్శించారు. అనంతరం అక్కడ ఏర్పాటుచే సిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ బీసీలకు 42 శాతం రిజర్వేషన్ పెంచుతామని హామీ ఇవ్వడం జరి గిందని, ఇచ్చిన హామీమేరకు పెం చిన తరువాతే స్థానిక గ్రామ పంచాయతీ ఎన్నికలు నిర్వహించాలని ఆయన డిమాండ్ చేశారు. బీసీలు 60 శాతం పైగా ఉన్నారని ఇందులో 136 కులాలు ఉన్నాయని, అత్యంత వెనుకబడిన వారు ఉన్నారని ఆయన ఆరోపించారు. ప్రస్తుత ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం 42 శాతం రిజర్వేషన్ ఇచ్చేందుకు కామా రెడ్డిలో బీసీ డిక్లరేషన్‌లో ఇచ్చిన హామీ ప్రకారం ఎన్నికల్లో రిజర్వేషన్ పెంచాలన్నారు. కార్యక్రమంలో రామన్ గౌడ్, భీమన్న నాయుడు, బాలరాజు గౌడ్, జనార్ధన్ గౌడ్, హరికృష్ణ గౌడ్, వెంకటన్న గౌడ్, మన్నెం గౌడ్, తిరుపతయ్య, నరేందర్, నరేశ్, రాఘవేందర్, సురేందర్ తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న జాజుల శ్రీనివాస్ గౌడ్

## ప్రజా పోరాటాలతోనే సమస్యల పరిష్కారం



పాల్కెపహాడ్‌లో సీపీఐ శ్రేణులతో మాట్లాడుతున్న విజయ రాములు

గోపాల్‌పేట, జూన్ 8: ప్రజా పోరాటాల ద్వారానే సమస్యల పరిష్కారమవుతాయని అందుకు సిద్ధం కావాలని సీపీఐ జిల్లా కార్యదర్శి విజయ రాములు అన్నారు. ఆదివారం మండలంలోని పాల్కెపహాడ్‌లోఆయన పార్టీ శ్రేణులతో సమా వేశ మ య్యారు. సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు చంద్రయ్య అధ్యక్షతన గ్రామ నూతన కమిటీని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పోరాటాలు చేయకపోతే పేదల కష్టాలు తీరవన్నారు. ప్రభుత్వం పేదలకు ఇండ్ల స్థలాలు, రైతు రుణమాఫీ, ఉచిత కరెంట్, పంటలకు మద్దతు ధర వంటి సమస్యలపై ప్రజలు సమీకరించి పోరా టాలు చేస్తేనే పాలక ప్రభుత్వాలు అమలు చేశాయన్నారు. జరుగనున్న స్థానిక ఎన్నికల్లో పార్టీ నుంచి అభ్యర్థులను నిలబెట్టి గెలిపించుకుందామన్నారు. సీపీఐ గ్రామ కార్యదర్శిగా బొగ్గు బుచ్చన్న, సహాయ కార్యదర్శిగా మోహన్, బంగారయ్యతో పాటు 11 మందిని కమిటీ సభ్యులుగా ఎన్నికయ్యారు. కార్యక్రమంలో వనపర్తి పట్టణ కార్యదర్శి రమేశ్ నాయకులు శాంతన్న పాల్గొన్నారు.

## ఎల్‌హెచ్‌పీఎస్ నాయకుడి అరెస్ట్

నవా బ్‌పేట, జూన్ 8 : మండలంలోని వెంక టేశ్వరతండాకు చెందిన ఎల్ హెచ్‌పీఎస్ నాయకుడు లింబ్యానాయ క్‌ను ఆదివారం పోలీసులు అరెస్టు చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. మంత్రి వర్గ విస్తరణలో లంబాడీలకు ఒక్క మంత్రి పదవి కూడా ఇవ్వని నేపథ్యంలో ముఖ్యమంత్రి ఇల్లును ముట్టడించాలని ఎల్‌హెచ్‌పీఎస్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు హైదరాబాద్ తరలి వెళ్తున్న తరుణంలో పోలీసులు లాంబ్యా నాయక్ ఇంటికి వెళ్లి అరెస్ట్ చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. అనంతరం విడుదల చేశారు. గిరిజనులకు ఒక్క మంత్రి పదవి కూడా ఇవ్వకపోవడం విడ్డూరమనిఆరోపించారు.

## దివ్యాంగుల ఉపకరణాలకు దరఖాస్తుల ఆహ్వానం

గద్వాల, జూన్ 8: జిల్లాలోని దివ్యాంగుల ఉపకరణాల కోసం ఆన్ లైన్‌లో దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు మహిళా, శిశు, దివ్యాంగుల, వయోవృద్ధుల సంక్షేమశాఖ అధికారిణి సునంద ఆదివారం ప్రకటనలో తెలిపారు. రెట్రోఫిట్టె డ్‌మోటరైజ్డ్ వాహనాలు, బ్యాటరీ వీల్ చైర్స్, హైబ్రీడ్‌వీల్ చైర్, ల్యాప్‌టాప్స్, ట్యాబ్స్, 4జీ స్మార్ట్‌ఫోన్స్, ట్రైసైకిళ్లు, క్యాలిపేర్స్, ఆర్టిఫిషియల్ లింబ్స్, కిట్స్, టీచింగ్ లెర్నింగ్ సామాగ్రి ఉచితంగా పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. అవసరమైనా దివ్యాంగులు,https://obmscgg.gov.in వెబ్‌సై ట్‌లో ఈ నెల 8నుంచి 18వ తేదీ వరకు అవసరమైనా ధ్రువీకరణ పత్రాలతో ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న దరఖాస్తు ఫామ్, సదరం సర్టిఫికెట్, ఆధార్, విద్య, ఆదాయ ధృవీకరణ పత్రం, తెల్లరేషన్ కార్డు మొదలైనా పత్రాలను జిల్లాలో ఉన్న ఐడీవోసీ కలెక్టరేట్‌లోని సంక్షేమశాఖ గది నంబర్ జీ-33లో అందజేయాలని కోరారు. వివరాలకు 90101 61 406 నెంబర్‌ను సంప్రదించాలని కోరారు.

## జర్నలిస్టులందరికీ ఇండ్ల స్థలాలు

వనపర్తి టౌన్, జూన్ 8: జర్నలిస్టులందరికీ ఇండ్ల స్థలాలు, వైద్యం, విద్యా రంగాలలో రాయితీలు వర్తింపజేస్తామని ఎమ్మెల్యే మేఘారెడ్డి అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని దాచలక్ష్మయ్య ఫంక్షన్‌హాల్‌లో జర్నలిస్టుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ముందుగా వివిధ మండలాల నుంచి వచ్చిన జర్నలిస్టులు వారి సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రతి జర్నలిస్టులకు బీమా చేయిస్తానని, గ్రామస్థాయి నుంచి వచ్చిన నాకు జర్నలిస్టుల సమస్యలు తెలుసని అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇంటి స్థలాలు, ఇందిరమ్మ ఇండ్లు వర్తింప చేస్తామని, త్వరలో జిల్లా కేంద్రంలో ప్రెస్ క్లబ్ భవన నిర్మాణానికి నిధుల మంజూరుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో జర్నలిస్టు సంఘాల నాయకులు రవీందర్‌రెడ్డి, రమేశ్, మాధవరావు, అంబటి స్వామి, నాగేశ్, లక్ష్మణ్, ఊశన్న తదితరులు పాల్గొన్నారు.

## రక్తదాన శిబిరం విజయవంతం


రక్తదానం నిర్వహిస్తున్న దృశ్యం

వనపర్తి టౌన్, జూన్ 8: జిల్లా కేంద్రంలోని 28వ వార్డు వెంగ ళావు కాలనీలో ఆదివారం ఏర్పాటుచే సిన ఉచిత రక్తదాన శిబిరం విజయవంతమైనట్లు నిర్వాహకులు కోట్ల శిరీషరవి తెలిపారు. ఈ శిబిరంలో కాలనీకి చెందిన యువకులు, మాజీ కౌన్సిలర్లు రక్తదానం చేశారు. దాదాపు 300మంది వైద్య సేవలు వినియోగించుకున్నట్లు వారు చెప్పారు. కార్యక్రమంలో మాజీ ప్రజాప్రతిని ధులు నక్కరాములు, ప్రేమ్‌నాథ్‌రెడ్డి, కదిరెరాములు, వినోద్ గౌడ్, శివ గౌడ్, ఎండీ బాబా, రాములు, కోళ్ల వెంకటేశ్, యాదయ్య, చర ణ్‌రాజు, నాగార్జున, రవి సాగర్ ఉన్నారు.

## ధర్మసమాజ్ పార్టీ అధ్యక్షుడిగా శ్రీనిప్రసాద్

పాన్‌గల్, జూన్ 8: మండల ధర్మ సమాజ్‌పార్టీ మండల అధ్యక్షుడిగా శ్రీనిప్రసాద్ ఏకగ్రీవంగా ఎన్నిక య్యారు. ఆదివారం మండల కేంద్రంలో ఆ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి అశోక్ మహారాజ్ అధ్య క్షతన సమావేశం నిర్వహించుకున్నారు. కార్యవర్గసభ్యుడిగా శివరాజ్, రాములు, లక్ష్మణ్‌ను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ధర్మ సమాజ్‌పార్టీ బలోపేతానికి కోసం కృషిచేస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఆదిసంధ్యారాణి, రామకృష్ణ, శేఖర్, లక్ష్మణ్, సురేందర్ పాల్గొన్నారు.

## అంత్యక్రియల్లో విషాదం

- అమ్మమ్మ దహనానికి కట్టెలకు వెళ్లి మనువడు మృతి

గండీడ్, జూన్ 8 : అమ్మమ్మ అంత్యక్రియల్లో దహనానికి కట్టెల కోసం వెళ్లి వస్తుండగా, ట్రాక్టర్ బోల్తా పడి మనవడు మృతిచెందిన ఘటన గండీడ్ మండలంలోని బల్సూర్ గొండలో చోటుచేసుకున్నది. స్థానికుల కథనం ప్రకారం.. బల్సూర్‌గొండకు చెందిన బాలవర్ధన్‌రెడ్డి(40) తన అమ్మమ్మ ఆదివారం తెల్లవారు జామున మృతిచెందడంతో ఆమె అంత్యక్రియల కోసం ట్రాక్టర్ తీసుకొని కట్టెల మిషన్ నుంచి గ్రామానికి సమీపంలోకి రాగానే ట్రాక్టర్ అదుపుతప్పి కాల్వలో పడిపోయింది. ట్రాక్టర్ కింద పడిన బాలవర్ధన్‌రెడ్డి అక్కడికక్కడే మృతిచెందాడు. ఒకే ఇంట్లో ఇద్దరు మృతిచెందడంతో ఆ కుటుంబ సభ్యుల బాధ వర్ణనాతీతంగా మారింది.

## విద్యుదాఘాతంతో రెండు గేదెలు మృతి

బాలానగర్, జూన్ 8 : రాజాపూర్ మండలం రాఘవాపూర్ శివారులో ఆదివారం సాయంత్రం ఈదురు గాలులకు విద్యుత్ తీగలు తెగిపడటంతో రెండు గేదెలు మృతిచెందాయి. రాఘవాపూర్‌లో రెండు గేదెలు మృతిచెందినట్లు బాధితుడు పిట్టల లక్ష్మయ్య తెలిపారు.

# బడిడు పిల్లలను ప్రభుత్వ బడిలో చేర్పించాలి


కొంకలలో కరపత్రాలను పంపిణీ చేస్తున్న ఉపాధ్యాయులు


అయిజ : పులికల్ బడిబాటలో పాల్గొన్న ఉపాధ్యాయులు

అయిజ, జూన్ 8: బడీడు పిల్లలందరినీ బడిలో చేర్పించాలని ఉపా ధ్యాయులు అరుణ, సుమలత తల్లిదండ్రులను కోరారు. ప్రభుత్వ పాఠశాలల్లోనే విద్యార్థులకు నాణ్యమైన విద్య అందుతుందని తల్లిదండ్రులకు సూచించారు. బడిబాట కార్యక్రమంలో భాగంగా ఆదివారం మండలంలోని పులికల్‌లో జీహె చ్‌ఎం ఉషారాణి ఆదేశాల మేరకు జెడ్పీహెచ్ఎ స్‌కు చెందిన ఉపాధ్యాయులు ఇంటింటికీ వెళ్లి విద్యార్థులను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా ఉపా ధ్యాయులు మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలు, ఆంగ్ల బోధన తదితర అంశాలను వివరించారు. ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన ఆంగ్ల విద్యను ప్రభుత్వం ప్రవేశ పెట్టిందన్నారు. గ్రామంలో పర్యటిస్తూ తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో తల్లిదండ్రులు పాల్గొన్నారు.

***వడ్డేపల్లిలో..***

వడ్డేపల్లి, జూన్ 8: ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించాలని కోరుతూ ఆదివారం బడిబాట కార్యక్రమంలో భాగంగా కొంకలలో హెచ్‌ఎం శేఖర్‌బాబు ఇంటింటికీ తిరిగి ప్రచారం చేశారు. ప్రభుత్వ పాఠశాలలో నాణ్య మైన విద్యను అందిస్తున్నామని, ఉచితంగా యూని ఫామ్స్, పాఠ్యపుస్తకాలు, నోట్ పుస్తకాలు, మధ్యాహ్న భోజనం అందజేస్తున్నామని ప్రచారం చేశారు. 15మంది విద్యార్థుల పేర్లు నమోదు చేసుకున్నారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు నాగేశ్వర్‌రెడ్డి, అంగన్‌వాడీ టీచర్లు వరలక్ష్మి, చంద్రకళ, ఎంవీ ఫౌండేషన్ బడేసాబ్, బీచుపల్లి గౌడు, గుడిసె శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

***ధరూర్‌లో..***

ధరూర్, జూన్ 8: బడీడు పిల్లలు బడిలో ఉండాలని, బడికి పంపించి వారి బంగారు భవిష్యత్‌కు పునాదులు వేయాలని హెచ్‌ఎం సరోజమ్మ పేర్కొన్నారు.

ఆదివారం మండలంలోని పార్చర్లలో బడిబాట కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు గ్రామంలోని ఇంటింటికి వెళ్లి సర్వే చేపట్టి బడికి పోని పిల్లలను గుర్తించి వారి తల్లీదండ్రులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అమ్మ ఆదర్శ పాఠశాల చైర్మన్ అనంతమ్మ, ఉపాధ్యాయులు రాజశేఖర్ గౌడ్, సీఆర్పీ నర్సింహులు తదితరులు పాల్గొన్నారు.